

- జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పనులు కరువు
- ఉపాధి హామీ పనులవైపు.. కూలీల చూపు
- ఉపాధి కూలీల వేతనాన్ని పెంచిన కేంద్రం
- జిల్లాలో మొత్తం 2,55,236 జాబ్ కార్డులు

ఉపాధి పరుగు



నిజామాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఎండలు పెరగడం.. గ్రామాల్లో పనులు తగ్గడంతో అనేక మంది ఉపాధి హామీ పనుల వైపు పరుగులు పెడుతున్నారు. గ్రామాల్లో చేపట్టే పనులకు పెద్ద ఎత్తున హాజరవుతున్నారు. గడిచిన కొన్ని రోజులుగా క్రమేపి కూలీల సంఖ్య పెరుగుతోంది. కొత్త ఆర్థిక సంవత్సరం మొదలు కావడం, పనుల సంఖ్య పెరుగుతుండడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కూలీల వేతనం కూడా పెరగడంతో గ్రామాల్లో ఎక్కువ పనులు కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. చెరువులు, కాల్వల పూడిక తీయడంతో పాటు ఇతర పనులను ప్రస్తుతం చేస్తుండగా మరికొన్ని పనులను గుర్తించి అనుమతులను తీసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో ప్రతిరోజూ 40వేల మందికి పైగా కూలీలు పనులకు వస్తుండగా మరోవారం రోజుల్లో మరింత ఎక్కువ మంది పెరిగే అవకాశం ఉండటంతో పనులు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉపాధి పనులవైపు గ్రామస్థుల చూపు

జిల్లాలో ఉపాధి హామీ పథకానికి ఆదరణ పెరుగుతోంది. వేసవి మొదలు కావడం గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గిపోయాయి. దీంతో గ్రామం పరిధిలోని పేదలు, సన్న, చిన్నకారు రైతు కుటుంబాల వారు ఎక్కువ మంది ఉపాధి హామీ పనులవైపు చూస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిరోజూ చేపట్టే పనులకు హాజరవుతున్నారు. ఉపాధి హామీ పథకం కింద 2023-2024 ఆర్థిక సంవత్సరం ముగిసిపోవడం కొత్త సంవత్సరం మొదలు కావడంతో పనుల సంఖ్య కూడా రెట్టింపు కానుంది. జిల్లాలో మొత్తం 2లక్షల 55,236 జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 4లక్షల 83,762 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరిలో దాదాపు లక్ష మంది వరకు ప్రతి సంవత్సరం ఈ పనులకు ఎక్కువగా వస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ పంటలు ఉన్న సమయంలోనే పనులు ఉండటం మిగతా సమయంలో తక్కువగా ఉండటం వల్ల ఈ పనులకు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. కుటుంబంలో ఉన్నవారందరూ స్థానికంగానే పనులు దొరకడంతో ఎక్కువ మంది ఉపాధి వైపు వెళ్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు కూలీ రేట్లు ప్రతిరోజూ గరిష్ఠంగా 272 రూపాయలు ఉండేది. కేంద్ర ప్రభుత్వం సడలించిన నిబంధనల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ప్రతి కూలీకి 300 రూపాయలు గరిష్ఠ వేతనాన్ని నిర్ణయించారు. ప్రస్తుతం చేపట్టే పనులందరికి వారు చేసిన రోజువారి పని బట్టి గరిష్ఠంగా 300 రూపాయల వరకు వారి ఖాతాల్లో జమ కానున్నాయి. గ్రామాల్లో పనులు తగ్గడం వల్ల ఎక్కువగా ఉపాధి పనులపై కూలీలు నజర్ పెట్టడంతో అధికారులు ఆ గ్రామ పరిధిలోని పనులు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా చెరువుల్లో పూడిక తీయడం పనులను ఎక్కువగా చేపడుతున్నారు. చెరువుల్లో పనులు చేయడం వల్ల ఎక్కువ మందికి ఉపాధి దొరకడం, చెరువులకు కూడా పూడిక తీయడం వల్ల ఉపయోగం ఉండటంతో ఈ పనులను చేపడుతున్నారు. వీరితో పాటు వ్యవసాయ పంటలకు వెళ్లే ప్రధాన కాలువల పనులను కూడా చేపడుతున్నారు. కాలువల్లో చెట్లు తొలగించడం, మట్టిని తీసివేయడం, వానాకాలం వరకు నీళ్లు వెళ్లేందుకు అనుకూలంగా ఈ పనులను చేస్తున్నారు. ఇవేకాకుండా అటవీ ప్రాంత గ్రామాల్లో కందకాల తవ్వకాలు, ఇతర పనులను చేపడుతున్నారు. ముందుగానే గ్రామాల్లోని జాబ్‌కార్డుల ఆధారంగా ఎంత మంది కూలీలు వస్తారో అంచనా వేసి ఈ పనులు చేపడుతున్నారు.

జిల్లాలో 40వేల మంది వరకు పనులు

జిల్లాలో గడిచిన కొన్ని రోజుల వరకు 25 నుంచి 30వేల వరకు కూలీలు రాగా ప్రస్తుతం 40వేల వరకు పనుల్లోకి వస్తున్నారు. మరొక వారం దాటితే 70 నుంచి 80వేల వరకు కూలీలు పనులకు వస్తారని అంచనా వేస్తున్నారు. ఏప్రిల్, మే నెల వరకు పనులు గ్రామాల్లో ఏమి ఉండే పరిస్థితి లేకపోవడం వల్ల ఎక్కువగా ఉపాధి హామీ పనులపైనే కూలీలు ఆధారపడుతున్నారు. ప్రతి సంవత్సరం ఈ పనులను కల్పిస్తున్నారు. జిల్లాలో 2023-24 సంవత్సరంలో సుమారు 90 కోట్ల రూపాయల పనులను పూర్తి చేశారు. ఈ సంవత్సరం కూడా జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి వంద రోజులు పనికల్పించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రతిరోజూ పనులకు వచ్చే కూలీలను గుర్తించడంతో పాటు ఎన్ఐసీ రూపొందించిన ఎన్ఎంఎంఎస్‌లో వారి పని వివరాలను నమోదు చేస్తున్నారు. పని వివరాలను ఏరోజుకు ఆరోజు సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తూనే కూలీల వేతనాలు విడుదల అవుతున్నాయి. వీరు చేసే పనులకు మెటీరియల్ కంపోనెంట్ కింద నిధులు వస్తుండటంతో వాటిని గ్రామ పంచాయతీల పరిధిలో వినియోగిస్తున్నారు. జిల్లాలో ఈ వేసవిలో ఎంత మంది పనికి వచ్చిన కల్పించేందుకు ముందుగానే అధికారులు ఏర్పాట్లు చేశారు.

> **జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న కూలీల సంఖ్య..**
>
> **: సాయాగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి**
>
> జిల్లాలో ప్రస్తుతం ఉపాధి హామీ పనులకు ఎక్కువ మంది కూలీలు వస్తున్నారు. ప్రతిరోజూ కూలీల సంఖ్య పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 40వేల మంది వరకు ప్రతిరోజూ వస్తున్నారు. ఈ సంఖ్య వారం రోజుల్లో డబుల్ అయ్యే అవకాశం ఉంది. పనులు కల్పించడంతో పాటు గరిష్ఠ కూలీ వచ్చే విధంగా వారికి పనిని ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జాబ్ కార్డులు అడిగిన వారికి కూడా కొత్తవి మంజూరు చేస్తున్నాం.



● మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

- సీఎం రేవంత్‌రెడ్డి, ప్రధాని నరేంద్రమోదీ ఒక్కటే
- ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలవుతున్నా.. హామీలు నెరవేర్చలే
- ఎంపీ అర్వింద్, సుదర్శన్‌రెడ్డిల మధ్య మ్యాచ్ ఫిక్సింగ్
- సమావేశంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం వస్తుంది..

సుభాష్‌నగర్, ఏప్రిల్ 1: రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌కు మళ్లీ పూర్వవైభవం వస్తుందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేకనే బీఆర్‌ఎస్ నుంచి అభ్యర్థులను తీసుకుంటున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి, నరేంద్రమోదీ ఒక్క టేనన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన అర్బన్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి పార్టీ మారిన వారిని రాళ్లతో కొట్టండి అని చెప్పి.. ప్రస్తుతం అందరికీ కండువా కప్పుతున్నారన్నారు. బీజేపీ ప్రకటించిన పార్లమెంట్ అభ్యర్థుల్లో ఎనిమిది మంది బీఆర్‌ఎస్ నాయకులే ఉన్నారని తెలిపారు. కొద్దిగా ఏమరపాటుగా ఉండటం వల్లే అధికారాన్ని కోల్పోయామన్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి నిజామాబాద్ ఎప్పుడైనా వచ్చాడా!? నిజామాబాద్‌కు ఒక్క రూపాయి అయినా నిధులు ఇచ్చాడా!? అని ప్రశ్నించారు. ఎంపీ అర్వింద్ సైతం బాల్కానిలో కూర్చొని సోషల్ మీడియాలో మాట్లాడటం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రేవంత్‌రెడ్డి గతంలో తెలంగాణను గుజరాత్ మోడల్ చేస్తానని అన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్నది కాంగ్రెస్ పార్టీ కాదని.. రేవంత్‌రెడ్డి పార్టీ అని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో రేవంత్‌రెడ్డి, మోదీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. జీవన్‌రెడ్డి, అర్వింద్, రేవంత్‌రెడ్డి, మోదీలందరూ ఒక్కటేనని.. కవితను ఓడగొట్టడానికి గతంలో కాంగ్రెస్ పార్టీ వాళ్లు మొత్తం అర్వింద్‌కు ఓట్లు వేయించారన్నారు. జీవన్‌రెడ్డి గత పార్లమెంట్ ఎన్నికల్లో తన నియోజకవర్గ ఓట్లన్నీ బీజేపీకి వేయించాడని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి గెలుపు కాదన్నారు. బీజేపీ బోధన్ ఇన్‌చార్జి మేడపాటి ప్రకాశ్‌కు టికెట్ ఇవ్వాల్సి ఉంటే.. అర్వింద్, సుదర్శన్‌రెడ్డిలు కలిసి మోహన్‌రెడ్డికి ఇప్పించారని అన్నారు. దీంతో షకీల్ స్వల్ప తేడాతో ఓడిపోయారని అన్నారు. అర్వింద్, సుదర్శన్‌ల మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండే పరిస్థితి లేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్, మేయర్ దండు నీతూ కిరణ్, పార్టీ నగర అధ్యక్షుడు సిర్పరాజు తదితరులు పాల్గొన్నారు.



● కట్టకు గండిపడి కాలనీల్లోకి వెళ్తున్న కెనాల్ నీరు

- ఇళ్లల్లోకి చేరిన నీరు.. కొట్టుకుపోయిన సామగ్రి
- తీవ్ర అవస్థలు పడ్డ కాలనీవాసులు
- అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం
- కెనాల్ గండిని పూడ్చిన అధికారులు

నిజాంసాగర్ కెనాల్ కట్టకు గండి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 1: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో గల నిజాంసాగర్ కెనాల్ కట్టకు సోమవారం తెల్లవారుజామున గండి పడింది. దీంతో కాలనీలోని ఇళ్లల్లోకి నీరు చేరడంతో.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గండి పడిన ప్రదేశంలో విద్యుత్ స్తంభం వంగిపోవడంతో.. కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీవాసులు తెల్లవారుజాము 3 గంటల నుంచి ఉదయం వరకు చీకట్లో ఉన్నారు. ఒక్కసారిగా ఇళ్లల్లోకి నీరు చేరడంతో.. నిత్యావసర సరుకులు, సామగ్రి కొట్టుకుపోయింది. దీంతో చిమ్మచీకట్లో ఏం జరుగుతుందో తెలియక జనం పరుగులు తీశారు. సమాచారం అందుకున్న జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది, ఇరిగేషన్ అధికారులకు గండిని పూడ్చివేయాలని ఆదేశించడంతో.. వారు వెంటనే గండిని పూడ్చివేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ భోజన వసతిని కల్పించారు.

కట్టపై ఆక్రమణల వల్లే..

ఆర్మూర్‌లోని నిజాంసాగర్ కెనాల్ కట్టను ఆనుకొని పలువురు కబ్జాదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఇటీవల కెనాల్ కట్టపైనే ఓ వ్యక్తి పందుల పెంపకానికి గుడిసెను సైతం నిర్మించుకున్నాడు. అలాగే కెనాల్‌లో గత కొన్నేళ్లుగా పూడిక తీయకుండా ముళ్ల పొదలు, కాలనీవాసులు వేసిన చెత్త పేరుకుపోవడంతో నీరు నిలిచి కెనాల్ కట్ట బలహీన పడింది. గత కొద్ది రోజులుగా గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగి పంటను దృష్టిలో పెట్టుకొని చెరువులు నింపడానికి నీటిని వదిలారు. ఇరిగేషన్ అధికారులు నిజాంసాగర్ కెనాల్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించినట్లయితే ఈ సంఘటన జరిగేది కాదు. కబ్జాదారులు నిజాంసాగర్ కెనాల్ కట్టను అనుకొని ఇంటి నిర్మాణాలు చేస్తున్న ఇరిగేషన్ అధికారులు నిలిపివేసిన దాఖలాలు లేవు. దీంతో కెనాల్ కట్ట ఒక్కసారిగా తెగిపోయింది. కాగా.. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే ఈ ఘటన జరిగిందని జర్నలిస్టు కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఇప్పటికైనా నిజాంసాగర్ కెనాల్‌పై అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.







● ఇళ్లల్లోకి చేరిన కాలువ నీరు



ఎంపీ ఎన్నికల ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారం, సమన్వయం కోసం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలను నియమించింది. ఏఐసీసీ నేతల ఆదేశాలతో నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిని సీఎం నియమించారు. ఆయన ఆధ్వర్యంలోనే పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించడంతో పాటు సమన్వయం చేసి కార్యక్రమాలు బహిరంగ సభలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర స్థాయిలో మెజార్టీ సీట్లను గెలుచుకోవాలని భావిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి పార్టీతో పాటు జిల్లాలో పట్టున్న నేతలను ఇంచార్జిలుగా నియమించారు. జిల్లాతో పాటు జగిత్యాల జిల్లాల నేతలతో పరిచయాలు ఉండటంతో ఆయన ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిగా నిలబెట్టిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని గెలిపించేందుకు కాంగ్రెస్ నేతలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో 14 సీట్ల వరకు సాధించాలని భావించిన సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని నియమించారు. ఆయన ఆధ్వర్యంలో పార్లమెంట్ పరిధిలో కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో సీనియర్ నేతలు ఎక్కువ మంది ఉన్నారు. వర్కింగ్ ప్రసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నియోజకవర్గ ఇంచార్జిలు సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, నర్సింగరావు, జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, నగర అధ్యక్షుడు కేశవేణు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు అరికెల నర్సారెడ్డి, ఆకుల లలితతో పాటు శేఖర్‌గౌడ్, రత్నాకర్‌తో పాటు ఇతర నేతలు ఉన్నారు. వీరందరిని కలుపుకొని సమన్వయం చేసుకుంటూ పార్టీ నిర్ణయించిన అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని గెలిపించుకునే విధంగా చూసేందుకు నిర్ణయించారు.

పోస్టల్ బ్యాలెట్ కోసం
ఫారం-12(డి) సమర్పించాలి



● దివ్యాంగుడికి ఫారం-12డిని అందజేస్తున్న బీఎల్‌వో

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1: పోస్టల్ బ్యాలెట్ కోసం ఈనెల 20లోపు నిర్ణీత ఫారం-12(డి)ను పూరించి సంబంధిత శాఖల నోడల్ అధికారుల ద్వారా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. కలెక్టర్‌లో సోమవారం నోడల్ అధికారుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ద్వారా మీడియా పాసులు కలిగిన జర్నలిస్టులకు కూడా ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించేందుకు ఎన్నికల కమిషన్ వెసులుబాటు కల్పించిందన్నారు. సమావేశంలో నోడల్ అధికారి విజయేందర్‌రెడ్డి, అత్యవసర సర్వీసుల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫారం-12 డీ పంపిణీ..

ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో 80 ఏళ్ల పైబడిన సీనియర్ సిటీజన్‌లు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే రీతిలో ఫారం-12డిని పంపిణీ చేయిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో 85 ఏళ్ల పైబడిన ఓటర్లు 7,555 మంది ఉండగా, మార్చి 30 నాటికి 3,331 మందికి ఫారం-12డిని అందజేయడం పూర్తయిందన్నారు. అదేవిధంగా దివ్యాంగులైన ఓటర్లు 24,229 మంది ఓటరు జాబితాలో మార్కింగ్ చేయబడి ఉండగా వారిలో 10,175 మందికి నిర్ణిత ఫారాలను అందజేయడం జరిగిందని తెలిపారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

యానంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

డిచ్‌పల్లి, ఏప్రిల్ 1: డిచ్‌పల్లి మండలంలోని యానంపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం అందుబాటులో ఉంచిన సదుపాయాలను, ధాన్యం తీసుకువచ్చిన రైతుల వివరాలను, కొనుగోలు కేంద్రంలో ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతాంగానికి ఎలాంటి సమస్యలు రాకుండా పూర్తిస్థాయిలో కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి లారీలో లోడ్ చేసి రైస్‌మిల్లులకు పంపాలన్నారు. మిల్లుల వద్ద ధాన్యం లోడ్ అన్‌లోడ్ జరిగే చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లై డీఎం జగదీష్, తదితరులు ఉన్నారు.

కలెక్టర్, డీఈవోలను కలిసిన నిజామాబాద్ ట్రస్మా ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1: నూతనంగా ఎన్నికైన ట్రస్మా జిల్లా, నగర కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి జయసింహాగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, డీఈవో దుర్గాప్రసాద్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. గత ఏడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఓల్డ్ ఎన్జీవోస్ కాలనీలోగల ఫిజికల్ హ్యాండిక్యాపుడ్ ట్రైనింగ్ సెంటర్ భవనాన్ని ట్రస్మా నిజామాబాద్ జిల్లా కోసం కేటాయిస్తే.. దాని ద్వారా ప్రైవేటు ఉపాధ్యాయులకు ట్రైనింగ్ సెంటర్ కోసం, పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కలెక్టర్, డీఈవోలను కలిసిన వారిలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, కార్యదర్శి అరుణ్, కోశాధికారి మధు, గంగారెడ్డి, రమేష్, నగర అధ్యక్షుడు ధర్మరాజు, నగర కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

సిద్ధులగుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, ఏప్రిల్1: పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శివాలయంలో సిద్ధేశ్వరునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భారత్‌గ్యాస్ సుమన్ తిరుమల దంపతులు సిద్ధేశ్వరునికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా నందీశ్వర మహరాజ్ దంపతులకు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మిట్టపల్లి నిఖిత్‌రెడ్డి సరోజ దంపతులు భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి. సుమన్, పీసీ. గంగారెడ్డి, మల్లయ్య, బోండ్ల ఆనంద్, కొంతం మురళీ, సేవ సమితి సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు..సంరక్షణ మరిచారు

● వృథా అయిన ప్రజా ధనం ● పట్టించుకోని ఆర్మూర్ మున్సిపల్ పాలక వర్గం


పట్టణంలో మొక్కలు ఎండిపోయిన దృశ్యం


గతంలో మొక్కల పెంపకానికి గుంతలు తవ్విన దృశ్యం (ఫైల్‌ఫోటో)

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 1:మున్సిపల్ పరిధిలోని ప్రతీ వార్డులో గత నాలుగేళ్లుగా హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటి వాటికి ట్రీగార్డ్స్, కర్ర ఏర్పాటు చేశారు. కానీ వాటిని సంరక్షించే బాధ్యతను ఎవరు పట్టించుకోలేదు. కనీసం అధికారులు పర్యవేక్షించిన సందర్భాలు ఒక్కటి కూడా లేకపోవడం దురదృష్టకరం. మున్సిపల్ పరిధిలోని రెండో వార్డు జిరాయత్‌నగర్ నిజాంసాగర్ కెనాల్ పక్కన ఖాళీ స్థలంలో సుమారు వంద మొక్కలను నాటారు. నాటిన ఐదు నెలల్లో మొక్కలు ఎండిపోగా మరికొన్ని ప్రాంతాల్లోని పార్కులలో ఏర్పాటు చేసిన మొక్కలు ఒక్కటి కూడా లేకపోవడం విడ్డూరం. అధికారులు రికార్డుల్లో నమోదు కొరకు మొక్కలు నాటారే తప్ప వాటిని సంరక్షించడం లేదనే విమర్శలు బాగానే వినిపిస్తున్నాయి. ప్రతీ యేటా మొక్కల కొరకు వాటి సంరక్షణ కోసం లక్షల్లో ప్రజాధనం ఖర్చు చేస్తున్నారు. అయిన ప్రయోజనం లేదు. దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.. గడిచిన నాలుగేళ్లలో ఎన్ని మొక్కలు నాటారు. ఎంత బిల్లు లే పారో ఆ భగవంతుడికే తెలుసు. పట్టణ ప్రగతిలో భాగంగా హరితహారం కార్యక్రమం లో ప్రతీవార్డుకు 200 నుంచి 400మొక్కలు మెప్మా ఆర్పీలకు అందజేసి ప్రతి ఇంటికి మొక్కలు చేరేలా చూశారు. కానీ వారితోనే వెయ్యి మొక్కలను నాటినట్టు తీర్మానం చే యించారని పలువురు కౌన్సిలర్‌లు విమర్శిస్తున్నారు. ఒక్కో వార్డులో నాలుగింతలు ఎక్కువ రాయించారంటే 36వార్డులను కలిపితే చాలా మొత్తం రికార్డు రాయించారని, పెద్ద మొత్తంలో మొక్కల బిల్లులు లేపారా లేదా లేపే ప్రయ త్నం చేస్తున్నారా తెలియాల్సి ఉంది. ఎన్ని మొక్కలు నాటారు ఎన్ని రికార్డు చేశా రు. ఆ అక్రమార్కులకే తెలుసు. ప్రతిపక్షానికి చెందిన కౌన్సిలర్‌లు హరితహారంలో భాగంగా మొక్కల విషయంలో అవినీతి జరిగిందని బహిరంగంగానే చెబుతూ జిల్లా అధికారులతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో మూడు లక్షల మొక్కల పెంపకానికే అటవీ శాఖ అధికారులకు సుమారు రూ.50లక్షల 33వేలు అందినట్టు తెలిసింది. వారి అంచనా ప్రకారం రెండున్నర లక్షల వివిధ రకాల మొక్కలను మున్సిపాలిటీకి అందజేశారు. మొక్కలకు కర్ర, జాలీ ఏర్పాటులో ఎంత బిల్లు లేపారో తెలియాల్సి ఉంది. ఈ మొక్కల సంరక్షణ కొరకు నీటి ట్యాంకర్‌లను ఎంగేజ్ చేసుకొని నెలకు సుమారు రూ.2లక్షల చొప్పున ఖర్చు చేస్తున్నారు. వాటి సంరక్షణ కొరకు లేబర్‌లను సైతం కేటాయించారు. అయిన మొక్కలు భారీ సంఖ్యలో ఎండిపోతున్నాయి. లక్షల్లో ఖర్చు చేసిన ప్రయోజనం లేకపోవడంతో ప్రజలు ప్రజాధానం దుర్వినియోగమైందని విమర్శిస్తున్నారు.



మున్సిపల్ కార్యాలయం ఇదే..

మొక్కలలో జరిగిన అవినీతిని బయటకు తీయాలి



గత పాలకవర్గంలో మున్సిపల్ పరిధిలోని మొక్కలలో జరిగిన అవినీతిని బయటకు తీయాలి. ఎక్కడెక్కడ ఎన్ని మొక్కలు నాటారో వాటికి అయిన ఖర్చు ఎంతో జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి అవినీతిని వెలికితీయాలని ఆయన డిమాండ్ చేశారు.

- మైలారం బాలు, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ

సిక్కింలోని మంచు పర్వతాన్ని అధిరోహించిన నాళేశ్వర్‌వాసి

● భవిష్యత్‌లో మరిన్ని మంచు పర్వతాలను అధిరోహించడమే లక్ష్యం : మారుతి

నవీపేట, ఏప్రిల్ 1: మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన ఆర్మూర్ మారుతి ఇటీవల ఉత్తర సిక్కీం ప్రాంతంలోని మంచు పర్వతాన్ని అధిరోహించి సోమవారం హైదరాబాద్ చేరుకున్నారు. గత సంవత్సరం ఆగస్టు 15న ఆఫ్రికాలో 5,895మీటర్ల ఎత్తులో ఉన్న కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించారు. ప్రస్తుతం ఉత్తర సిక్కీం ప్రాంతంలో మైనస్ 15డిగ్రీల సెల్సియస్ వాతావరణంలో ఉన్న ఈ మంచు పర్వతాన్ని ఇప్పటి వరకు ఎవరు అధిరోహించలేదు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 32మంది బృందం సభ్యులు ఈ మంచు పర్వతాన్ని అధిరోహించడానికి గత నెలలో బయల్దేరి వెళ్లారు. ఇందులో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో నుంచి ఆర్మూర్ మారుతీ ఒక్కరే ఉండడం గమనార్హం. ఐహెచ్‌టీఏఈ(ఇండియన్ హిమలయన్ సెంటర్ ఫర్ అడ్వెంచర్ ఎకో టూరిజం)వారి ఆధ్వర్యంలో ఈ పర్వతారోహరణ చేపట్టారు. ఇందులో 12మంది వివిధ కారణాలతో వెనక్కి రాగా 20మంది ఈ మంచు పర్వతాన్ని అధిరోహించి అర్హత సాధించగా అందులో ఆర్మూర్ మారుతీ ఉండడం గర్వకారణం. తాము అధిరోహించిన మంచు పర్వతం చైనా సరిహద్దులో ఉంటుందని అక్కడి నుంచి కేవలం 6కిలో మీటర్ల దూరంలోనే చైనా సరిహద్దు మొదలవుతుందని ఆయన పేర్కొన్నారు. తాము అధిరోహించిన మంచు పర్వతం సుమారు 5200మీటర్ల ఎత్తులో ఉంటోందని వివరించారు. భవిష్యత్‌లో వివిధ దేశాలలో ఉన్న అంతర్జాతీయ స్థాయిలో మంచు పర్వతాలను అధిరోహించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇందులో పలువురు పర్వతారోహణ చేసిన వారికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతను అందించగా తెలంగాణ రాష్ట్రం నుంచి పర్వతారోహణ చేపట్టిన ఆర్మూర్ మారుతీ తన సొంత ఖర్చుతోనే ఈ పర్వతారోహణ చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్మూర్ మారుతీకి తగిన ప్రోత్సాహం అందించాలని పలువురు కోరుతున్నారు.


త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న ఆర్మూర్ మారుతి

ఏఐపీఎస్‌యూలో చేరికలు

పెద్దబజార్, ఏప్రిల్ 1: ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నుంచి భారీగా విద్యార్థి సంఘ నాయకులు ఏఐపీఎస్‌యూలో చేరారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బోడ అనిల్, నగర ఉపాధ్యక్షుడు సందీప్, బోధన్ డివిజన్ కార్యదర్శి సాయికుమార్, సిరికొండ మండల బాధ్యుడు సురేష్‌తో సహ ఇతర మండలాల నాయకులు ఆర్ఎస్‌పీ పార్టీ జిల్లా కార్యదర్శి సాయిబాబా ఆధ్వర్యంలో ఏఐపీఎస్‌యూలో చేరారు. వీరికి ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మన్నెకుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మన్నెకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. నూతనంగా సంఘంలో చేరిన వారికి గుర్తింపు ఉంటోందని త్వరలోనే జిల్లా సమావేశాన్ని ఏర్పాటు చేసి నూతన జిల్లా కమిటీని ప్రకటిస్తామన్నారు.



ఏఐపీఎస్‌యూలో చేరుతున్న నాయకులు

బార్ అసోసియేషన్ సభ్యులకు సన్మానం



బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న న్యాయాధికారి

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్1: పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆవరణలో సీనియర్ సివిల్ న్యాయాధికారి నసీంసుల్తాన సోమవారం బార్ అసోసియేషన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఇటీవల బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అసోసియేషన్ అధ్య క్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు పోడెటి శంకర్, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి అరుణ్‌కుమార్, కోశాధికారి తుమ్మ సుకేష్, సంయుక్త కార్యదర్శి సింధుకర్ చరణ్, గ్రంథాలయ కార్యదర్శి సూర సురేష్‌లను పట్టుశాలువ, పూలమాలలతో ఆమె ఘనంగా సన్మానించారు. ఎన్నికల అధికారులైన గరడి ఆనంద్, తాళ్ల శ్రీనివాస్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయ వాదులు భూపతిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, నరేందర్, జగదీష్, ఏలేటి గంగాధర్, సురేష్, కోనేరు, కృష్ణంరాజు, అశోక్, ప్రవీన్, విజయలక్ష్మీ, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఓలంపియాడ్ ఐఐటీలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన నలంద విద్యార్థులు

పెర్కిట్, ఏప్రిల్1: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నలంద పాఠశాల విద్యార్థులు 2023-24 విద్యాసంవత్సరం ఈ అబ్యాస్ హైదరాబాద్ వారు నిర్వహించిన ఓలంపియాడ్ ఐఐటీలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని యాజమాన్యం తెలిపారు. రాష్ట్రస్థాయిలో మొదటి 1, 2, 3ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్‌లు అభినందనలు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్‌లో ఐఎస్ఆర్‌వో శాస్త్రవేత్త సుబ్రమణ్యం చేతుల మీదుగా విద్యార్థులకు షీల్డ్‌లు అందజేశారు.

జవహర్ నవోదయకు ఎంపిక

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 1: మండలకేంద్రంలోని విజ్ఞాన జ్యోతి పాఠశాలకు చెందిన విద్యార్థి పాలెపు లోక్షిత కన్న(నాగాపూర్) నిజాంసాగర్ జవహర్ నవోదయకు ఎంపిక అయినట్లు పాఠశాల కరస్పాండెంట్ గుండోజి దేవేందర్, హెచ్.ఎం సౌమ్య తెలిపారు. ఇటీవల నిర్వహించిన జవహర్ నవోదయ విద్యాలయం 2024-25 విద్యాసంవత్సరంనకు గాను ఆరోతరగతి అర్హతపరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఆదివారం వెలువడిన పరీక్ష ఫలితాల్లో అర్హత సంపాదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని సోమవారం పాఠశాలలో యాజమాన్య కమిటి శాలువకప్పి, మెమోంటోతో సత్కరించి అభినందించారు. పట్టుదలతో చదివి రాబోవు రోజుల్లో ఇలాటి మరిన్ని విజయాలు సాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు, ఉపనాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాన్వకేషన్ ఫీజు పెంచలేదు

● రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 1: తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎలాంటి కాన్వకేషన్ ఫీజును విద్యార్థులకు పెంపుచేయలేదని విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు చెందాల్సిన అవసరం లేదని టీయూ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షల విభాగానికి సంబంధించి అన్ని రకాల ఫీజులు నిబంధనల ప్రకారమే కొనసాగుతున్నాయని అన్నారు.

పడకల్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

జక్రాన్‌పల్లి, ఏప్రిల్1: మండలంలోని పడకల్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి వేంటేశ్వరస్వామి దేవాలయంలో చోరీ జరిగినట్లు ఎస్సై వెంకట్ కుమార్ తెలిపారు. గుర్తు తెలియని దొంగలు ఆలయంలోని హుండీ తాళాలు పగలకొట్టి నగదును దొంగిలించారని తెలిపారు.సోమవారం పడకల్‌లోని చోరీ జరిగిన అలయాన్నిడిచ్‌పల్లి సీఐ, ఎస్సై పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నవీపేట,ఏప్రిల్1: నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గారావు ఫారం సమీపంలో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మృతుడికి 55నుంచి 60సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, అతడు చనిపోయి సుమారు రెండు రోజులు అయి ఉంటోందని భావిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మల్కాపూర్ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈరవత్రి అనిల్‌కు సన్మానం


ఈరవత్రి అనిల్‌ను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

ముప్కాల్, ఏప్రిల్1: తెలంగాణ రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన ఈరవత్రి అనిల్‌ను సోమవారం బాల్కొండ పద్మశాలి సంఘం అధ్యక్షుడు నాగభూషణం, సంఘం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా బాల్కొండ మండల పద్మశాలీ సంఘ అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను పాటుపడుతానని, ప్రజలకు సహాయ సహకారాలు అందజేస్తానని ఈరవత్రి అనిల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధా న కార్యదర్శి రామనాథం, ఏలిగేటి మధుకర్, కపీల్, రాజేందర్, చిలివేరి లక్ష్మీనారాయణ, పురుషోత్తం, జగదీష్, తదితరులు ఉన్నారు.


ముస్తాబైన మహాలక్ష్మి విగ్రహం

ఘనంగా మహాలక్ష్మి ఆలయంలో పూజలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 1: డిచ్‌పల్లి మండలంలోని ఘన్‌పూర్ మహాలక్ష్మి ఆలయంలో సోమవారం రేఖాసేనాసేత్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు చేశారు. అనంతరం నిర్వహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్య లో గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో మామిడిపల్లి వాసి ప్రతిభ

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్1: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన జెస్సు వెంకట్ వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకాన్ని సాధించారు. ఇటీవల పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిల్లీ సమీపంలోని నోయిడలో ఆదివారం జరిగిన నేషనల్ వేయిట్ లిఫ్టింగ్ పోటీలలో 90కేజీల విభాగంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి కాంస్య పతకం సాధించారు. వరల్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ (డబ్ల్యుపీసీ ఇండియా) ఆధ్వర్యంలో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిం చారు. తమ కుమారుడు పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించడం పట్ల జెస్సు శ్రీనివాస్ స్రవంతి, మామిడిపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించిన జెస్సు వెంకట్

బదిలీపై వెళ్లిన బోధన్ ఏసీపీకి డాక్టరేట్ ప్రధానం

బోధన్‌రూరల్,ఏప్రిల్1: బోధన్‌లో ఏసీపీగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన కిరణ్ కుమార్ సోమవారం పాండిచ్చేరి డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. ఏసీపీ కిరణ్ కుమార్ పలు సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడంతో ఆయన సేవలను అభినందిస్తూ గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ, డెలావేర్ స్టేట్, యూఎస్ఏ సంస్థల ఆధ్వర్యంలో ఏసీపీకి డాక్టరేట్ అందించారు. ఈ సందర్భంగా డాక్టరేట్ అవార్డు అందుకున్న ఏసీపీ కిరణ్ కుమార్‌లను పలువురు అభినందించారు.


డాక్టరేట్ అవార్డు అందుకుంటున్న కిరణ్ కుమార్

ఎన్నికల నిబంధనలపై అవగాహన ఉండాలి



ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో

బోధన్‌రూరల్,ఏప్రిల్1: ఎన్నికల నిబంధనలపై పూర్తిస్థాయి అవగాహన కలిగిఉండాలని బోధన్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఇందూర్ బీఈడీ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పోలింగ్ నిర్వహించే విధానంతో పాటు సంబంధిత శిక్షణలో భాగంగా పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నియమ, నిబంధనలపై ప్రతీ ఒక్కరు పూర్తిస్థాయి అవగాహన కలిగిఉండాలని ఆయన పేర్కొన్నారు. బోధన్‌లో రెండు రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. మాక్ పోలింగ్, ఈవీఎం, వీవీప్యాట్, డ్రా బాక్స్‌ల నుంచి మాక్ పోల్ స్లిప్పులను తీసివేయడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు.ఈకార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, ఆర్ఐ వరుణ్‌లతో పాటు 335మంది ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.


డీఐఈవోగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్



రవికుమార్‌ను అభినందిస్తున్న సిబ్బంది

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1: జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారిగా రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు డీఐఈవోగా పనిచేసిన రఘురాజ్ ఉద్యోగ విరమణ చేయడంతో ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కమీషనర్ రవికుమార్‌ను డీఐఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రవికుమార్ ప్రస్తుతం వర్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపళ్లు, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, లెక్చరర్లు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన పోతున్నూర్ మాజీ సర్పంచ్




పార్టీ కండువ కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ ఏప్రిల్ 1: సిరికొండ మండలం పోతున్నూర్ గ్రామ మాజీ సర్పంచ్ దర్శనం మంజుల బాలయ్య బీఆర్ఎస్ పార్టీకి రాజీనామాచేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మంజులకు కాంగ్రెస్ పార్టీ కండువ కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రావట్ల మాజీ ఎంపీటీసీ సభ్యులు గొల్ల ఎర్రన్న, ఆరె ప్రవీన్ గోవర్దన్ ఉన్నారు.

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అంతిరెడ్డి మోహన్‌రెడ్డి సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన ఆయనకు ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అంతేకాకుండా మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, విండో డైరెక్టర్లు, సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు అమృతాపూర్ గంగాధర్, కంచెట్టి గంగాధర్, శ్రీనివాస్, షాదుల్లా, తదితరులు ఉన్నారు.

ఐడీసీఎంఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం



తీర్మాన కాపీని డీసీవోకు అందజేస్తున్న నల్లవెల్లి సొసైటీ డైరెక్టర్లు

ఇందల్వాయి, ఏప్రిల్ 1: ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ పై నల్లవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్లు అవిశ్వాసం తెలిపారు. సంబంధిత తీర్మాన కాపీని డీసీవో శ్రీనివాస్‌రావుకు సోమవారం అందజేశారు. నల్లవెల్లి సొసైటీ చైర్మన్‌గా ఎన్నికై అనూహ్య పరిణామాల మధ్య ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా సాంబారి మోహన్ ఎంపికయ్యారు. అయితే నల్లవెల్లి సొసైటీలోని ఎనిమిది మంది డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేసి కాపీని డీసీవోకు అందించినట్లు తెలిపారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంలో కీలకంగా వ్యవహరిస్తున్న అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు సిర్నాపల్లి సొసైటీ డైరెక్టర్లతో అవిశ్వాసం పెట్టించడంలో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తుంది. ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ బీఆర్ఎస్ పార్టీలో కీలకంగా వ్యవహరించి నిత్యం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో వెంటే ఉండేవాడని ఆయన ఎమ్మెల్యేగా ఓడిపోవడం కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా భూపతిరెడ్డి గెలుపొందినప్పటి నుండి ఐడీసీఎంఎస్ చైర్మన్‌పై ఒత్తిడి పెరిగింది. కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లతో పాటు బీజేపీ పార్టీకి చెందిన డైరెక్టర్లు ఐడీసీఎంఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. త్వరలోనే అవిశ్వాసంపై సమావేశం ఉంటుందని తెలిపారు. దీంతో చైర్మన్ సాంబారి మోహన్ తన పదవిని కాపాడుకునేందుకు కాంగ్రెస్‌లో చేరుతారా పదవి గండం నుండి ఎలా బయటపడతారోనని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 1: రంజాన్ పండుగను పురస్కరించుకొని సోమవారం టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. నగరంలోని టీఎన్‌జీవోస్ కార్యాలయం సమావేశం మందిరంలో టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు అలుకకిషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు అలుక కిషన్ మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే పండుగ రంజాన్ పండుగ అన్నారు. పవిత్ర రంజాన్ రోజుల్లో ఉపవాస దీక్షలో ఉండే ఉద్యోగులు ఆయురారోగ్యాలతో ఉండాలని అల్లా దీవెనలు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రార్థనలు నిర్వహించి విందును ఆరగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నేతికుంట శేఖర్, గైనిగం గారాం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో సకల శుభాలు

బోధన్‌రూరల్,ఏప్రిల్1: నిత్యం శివనామస్మరణ చేస్తే సకల శుభాలు కలుగుతాయని వేద పండితులు గణేష్ మహరాజ్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జానకంపేట పాఠశాలలో చోరీ

ఎడపల్లి, ఏప్రిల్ 1: ఎడపల్లి మండలంలోని జానకంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఉన్నత ప్రాథమిక పాఠశాలలో రెండు తరగతి గదుల తలుపులను ధ్వంసంచేసి చోరీకి పాల్పడి సరస్వతీ విగ్రహానికి సంబంధించిన రోల్డ్ గోల్డ్ వస్తువులను దొంగిలించారు. సోమవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు చోరీకి గురైన ఘటన తెలుసుకుని వెంటనే ఎడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి జరిగిన ఘటన వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నుంచి సేకరించి కేసు నమోదు చేసుకున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కోటగిరిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



పెర్కిట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్



పెంటాకలాన్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోటగిరి,ఏప్రిల్1: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోటగిరి సహకార సంఘం కార్యదర్శి విఠల్ సూచించారు. కోటగిరి సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యానికి 2203రూపాయలు, బీ గ్రేడ్ ధాన్యానికి 2183రూపాయల గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నాణ్యతతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని సూచించారు. ధాన్యాన్ని దళారులకు అమ్ముకుని మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో విండో సిబ్బంది నారాయణ, లక్ష్మణ్, శంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● పోతంగల్‌లో..

పోతంగల్ మండలంలోని పోతంగల్, కల్లూర్, హెగ్డోలి గ్రామాలలో సోమవారం పోతంగల్ విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. విండో కార్యదర్శి భరత్ మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఏఈవో, రైతులుతదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మెప్మా ఆధ్వర్యంలో సోమవారం పిప్రిరోడ్డు, పెర్కిట్ వద్ద మున్సిపల్ కమిషనర్ రాజు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఏ గ్రేడ్ రకానికి రూ.2203, బీ గ్రేడ్ రకానికి రూ.2083 చెల్లించడం జరుగుతోందని, రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, సీవో రాజలింగం, నీలిమ, అనురాధ, మరియ, విజయ లక్ష్మీ, రాజలింగు, నాగరాణి, అన్నపూర్ణ, కల్పన, రైతులు పాల్గొన్నారు..

ఎడపల్లి: ఎడపల్లి మండల రైతులు రబీ సీజన్‌లో పండించిన వరిపంటను దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చి మద్దతు ధరను పొందాలని ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షుడు పోల మల్కారెడ్డి అన్నారు. సోమవారం ఎడపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఎడపల్లి, వడ్డాపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సహకార సంఘం కార్యదర్శి రాజారాం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చైర్మన్ మల్కారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి 2203, బి గ్రేడ్ రకానికి 2183 రూపాయల మద్దతు ధరను అందిస్తోందని, ప్రతీ రైతు కొనుగోలు కేంద్రాల ద్వారా తాము పండించిన వరి ధాన్యాన్ని అమ్మి లాభపడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజితా యాదవ్, సహకార సంఘం డైరెక్టరు బర్దిపూర్ ప్రవీణ్ కుమార్, మొద్దోల్ల సురేష్, ఎడపల్లి మాజీ సర్పంచ్ ఎల్లయ్య యాదవ్, రైతులు రాజిరెడ్డి, పండరినాథ్ రావు, శంకర్ గౌడ్, క్రిష్ణారెడ్డి, న్యావనంది గంగాధర్, ఆంజనేయులు, దూస గంగాధర్, సరిదాస్ సిబ్బంది ప్రభాకర్ గౌడ్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

బోధన్‌రూరల్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని క్లస్టర్ అధికారి రవీందర్ అన్నారు. సోమవారం బోధన్ మండలంలోని పెంటాకలాన్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం ధాన్యానికి 2203, బి గ్రేడ్ ధాన్యానికి 2183 క్వింటాలుకు మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలలో విక్రయించినప్పుడు పట్టాపాసు పుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి, వ్యవసాయ శాఖ అధికారి, రైతులు తదితరులున్నారు.

సిరికొండ: సిరికొండ మండలంలోని పలు గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, ఐడీసీఎంఎస్, ఐకేపీ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాలను సహకార శాఖ, వ్యవసాయ అధికారులు సోమవారం ప్రారంభించారు.సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పరిధిలోని సర్పెల్లి తండా, పెద్దవాల్గోట్, కొండూర్, సిరికొండ, మైలారం గ్రామాల్లో మానిటరింగ్ అధికారి రమేష్ ప్రారంభించగా, తూంపల్లి సహకార సంఘ పరిధిలోని సర్పంచ్ తండా, గోప్యతండా,గోప్యనాయక్ తండా,వర్క్యన్‌తండా, తూంపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, హొన్నాజిపేట్ సహకార సంఘ పరిధిలోని గడ్కోల్, ముషీర్‌నగర్ గ్రామాల్లో క్లస్టర్ అధికారి పోచయ్య కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రావుట్ల గ్రామంలో ఐడీసీఎంఎస్ కేంద్రాన్ని సంబంధితశాఖ అధికారి ప్రారంభించారు.చిన్నవాల్గోట్ గ్రామంలో ఐకేపీ కేంద్రాన్ని మహిల సమాఖ్య నాయకులు ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్లో సహకారశాఖ కార్యదర్శులు మహ్మద్ అలీ, దేవీలాల్, గంగానర్సయ్య, రైతులు పాల్గొన్నారు.



పెద్దవాల్గోట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మానిటరింగ్ అధికారి రమేష్

రెంజల్: రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల పాలు చేయకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రతీ ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని రెంజల్, నీలా, దూపల్లి గ్రామాల సొసైటీ కార్యదర్శులు రాము, రాందాస్, జీవన్‌రెడ్డి, ఆగ్రో రైతుసేవా కేంద్రం ప్రొప్రెటర్ సనాహుల్హాక్‌లు అన్నారు. సోమవారం రెంజల్, నీలా, దూపల్లి, వీరన్నగుట్ట గ్రామాల్లో సొసైటీ, ఆగ్రో రైతుసేవ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారుల పాలు చేయకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2183 లను అందిస్తోందని ఈ అవకాశాన్ని ప్రతీ రైతు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి లాభాలను ఆర్జించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి కృష్ణవేణి, సొసైటీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అష్టఐశ్వర్యాలు రావాలంటే సూర్యుడిని ఉపాసించాలి

● చినజీయర్ స్వామి గంగోత్రి రామానుజదాసు

మోపాల్, ఏప్రిల్ 1: ఆది దేవుడు సూర్య భగవానుడిని ప్రతినిత్యం దీపరాధన ఆదిత్య హృదయం పఠించడంతో పాటు ఆరాధించడం వల్ల ఆరోగ్యం బాగుండటంతో పాటు పాడిపంటలు సమృద్ధిగా పండాలంటే సూర్య చంద్ర అనుగ్రహం ఉండాలని దేవనాథ జీయర్ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజ దాసు స్వామి అన్నారు. మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోని ఇందూరు తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడో రోజు బ్రహ్మోత్సవాల్లో స్వాములతో పాటు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీయర్ స్వామి, రామానుజదాస్ స్వాములు మాట్లాడుతూ సూర్యప్రభ వాహనంపై సాయంత్రం చంద్రప్రభ వాహనం పై ఊరేగిన శ్రీవారు సూర్యోపాసన ద్వారా ఆరోగ్యం ఐశ్వర్యం లభిస్తాయని దేవనాథ జీయర్ స్వామి అన్నారు. రాముడు సూర్యుడిని ఉపాసించి రావణుడితో యుద్ధం గెలిచారన్నారు. ఆంజనేయుడు సూర్యుడిని ఉపాసించి సర్వశక్తివంతుడైనాడని సూర్యుడిని కొలిచే శమంతకమణిని పొందాడని గంగోత్రి రామానుజస్వామి అన్నారు. చంద్రుడిని ఉపాసన చేస్తే వజ్రకాయులు అవతార, చంద్రుని వెన్నెలతో పంటలు ఇత్యాది ఔషద తుల్యంగా మారుతాయని అన్నారు. మూడోరోజు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి,విజయ్‌సింహారెడ్డి, రవియాదవ్, నర్సారెడ్డి, నరాల సుధాకర్, ప్రసాద్, రాజేశ్వర్, రమేష్, సాయిలు, మురళి, చిన్నయ్య, ప్రమోద్, గంగారెడ్డి, లక్ష్మి, నరేష్, సురేష్, యజ్ఞాచార్యులు శిఖామణి స్వామి, రోహిత్‌కుమారాచార్యులు,విజయస్వామి పాల్గొన్నారు.



సూర్యనమస్కారం చేస్తున్న పండితులు, ప్రముఖులు

టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్1: రాష్ట్ర ప్రభుత్వం టెట్ పరీక్ష ఫీజులను వెంటనే తగ్గించాలని పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ డిమాం డ్ చేశారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏ ర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పులను ఈ ప్రభుత్వం చేయొద్దని, టెట్ పరీక్ష ఫీజులు పెంచడం సరైందికాదని, నిరుద్యోగుల జీవితాల్లో ఆటలు ఆడోద్దని అన్నారు. జిల్లా కేంద్రంలో టెట్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని, అనేక ఆశలతో నిరుద్యోగులు, యువత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేసి అధికారంలోకి తీసుకువచ్చారని, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను మరిచిపోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఏరియా ప్రధానకార్యదర్శి నిఖిల్, నాయకులు సిద్దు రవి, సూర్య ఉదయ్, విద్య, ఆకాంక్ష తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని దుర్వినియోగం చేయొద్దు

ధర్పల్లి, ఏప్రిల్ 1:తాగునీటిని దుర్వినియోగం చేయరాదని ఎంపీడీవో బాలకిషన్ అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామస్థులకు తాగునీటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం ఉండటంతో నీటి ఎద్దడి ఉండే అవకాశం ఉందని దీంతో గ్రామాల్లో ఎటువంటి నీటి ఎద్దడి చూడవల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటిపై రివ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రాజేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



తాగునీటిపై అవగాహన కల్పిస్తున్న ఎండీవో

జాతీయ పోటీలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



బంగారు పతకం సాధించిన క్రీడాకారులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 1: జాతీ యస్థాయి సబ్ జూనియర్ సా ఫ్ట్‌బాల్ పోటీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభకనబర్చారు. ఆరుగు రు క్రీడాకారులకు బంగారు పతకాలు లభించాయి.మహారాష్ట్రలోనిఔరంగబాద్ చత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన జాతీయ స్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్‌పోటీలో తెలంగాణరాష్ట్ర బాలికలజట్టుఫైనల్ లో పంజాబ్ జట్టుపై 8-2 పరుగుల తేడా తో విజయం సాధించింది. తె లంగాణ రాష్ట్ర జట్టులో జిల్లా క్రీడాకారులు సోని రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా గంగోత్రి, లిఖిత,నిశిత, సౌజన్య, సంహితలు కీలకపాత్ర పోషించి బంగారు పతకాన్ని అందుకున్నారు. బంగారు పతకం సాధి ంచడం పట్ల జిల్లా సాఫ్ట్‌బాల్ అసో సియేషన్ అధ్య క్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్‌లు, లింగారెడ్డి,సంగీత్‌రావు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1: ఈనెల 7వ తేదీన 6,7,10వ తరగతుల్లో మోడల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం నిర్వహించబోయే ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్‌టిక్కెట్లు తెలంగాణ.సిజిజి.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వాటిని డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ తెలిపారు. ఇతర వివరాలకు ఆర్మూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్ 93912 66444 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందికి జరిమానా

● నలుగురికి జైలుశిక్ష

ఖిల్లా, ఏప్రిల్ 1:మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందిని కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి సయ్యద్ ఖదీర్ 7 గురికి రూ.7400 జరిమానా, మరో నలుగురికి జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తుండగా మద్యం తాగి వాహనం నడిపిన 11 మందిని గుర్తించారన్నారు. రాజేందర్‌కు మూడు రోజులు, అజ్మీర నవీన్‌కు రెండురోజులు,సుంక టి శ్రీనివాస్‌కు రెండురోజులు, సోన్‌కాంబ్లే గంగారాంకు రెండురోజులు జైలు శిక్ష విధించడం జరిగిందనితెలిపా రు. మద్యం తాగి రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు ప్రతిరోజు సీపీ కల్మేశ్వర్ సింగనేవార్ ఆదేశాల మే రకు వాహనాల తనిఖీలు చేస్తున్నామని తెలిపారు.

ముస్లిం ఏతేకాఫ్ దీక్ష ప్రారంభం

బోధన్‌రూరల్,ఏప్రిల్1:రంజాన్‌మాసంలో ముస్లింభక్తులు చివరి పదిరోజులు అత్యంత పవిత్రంగా పాటించేది ఏతేకాఫ్ దీక్ష అని సున్నీ ఉల్మా అధ్యక్షుడు సుల్తాన్ ఖదీర్ తెలిపారు. బోధన్‌లోని పలు మసీదులలో సోమవారం అసర్ నమాజ్ ప్రార్థన అనంతరం ముస్లిం భక్తులు ఏతేకాఫ్‌దీక్ష చేపట్టారన్నారు. ప్రాపంచిక బహ్యావ్యవహారాలన్నీ త్యజించి దైవ నామస్మరణతో అదనపు నమాజ్‌లు ఖురాన్ పారాయణం చేస్తారని దీనినే ఏతేకాఫ్ అంటారని తెలిపారు. ఏతేకాఫ్ అనేది ఏకాంత ఆరాధన. ఈ పదిరోజుల దైవరాధన ఎనలేని ఆత్మ బలాన్ని ఇస్తుందన్నారు.ఈ మాసంలో ఏతేకాఫ్ దీక్షలు పాటించిన భక్తులు లోక కల్యాణాన్ని ఆకాంక్షిస్తూ చెడులకు దూరంగా ఉండేలా సన్మార్గంలో నడిచేందుకు ఈ దీక్షను పాటించడం విధిగాభావిస్తారన్నారు.అన్నపానీయాలు బంధు మిత్రులు,ఇతరముస్లిం భక్తులు,కుటుంబసభ్యులు అందిస్తారన్నారు. బోధన్‌లోని మసీదుల్లో ఏతేకాఫ్ దీక్షలు ప్రారంభమయ్యాయన్నారు.



మసీదులో ఏతేకాఫ్ దీక్షలో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.155	రూ.225	రూ. 265
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.235	రూ. 275

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.70,000	రూ.64,500	రూ.795

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : టిల్లు స్క్వేర్ (10.10, 1.10, 7.50, 10.50)
: ఓం భీమ్ భుష్ (4.40)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (12.00, 2.40)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (ఇంగ్లీష్) (5.20, 8.00, 10.40)
స్క్రీన్-3 : ది గోట్ లైఫ్ (12.05, 7.00)
: రజాకర్ (3.45)
: ఓం భీమ్ భుష్ (10.40)
స్క్రీన్-4 : క్రూ (హిందీ) (10.45, 1.35, 7.40, 10.30)
: ప్రేమలు (4.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : టిల్లు స్క్వేర్ (10.45, 1.40, 4.35, 7.30, 10.25)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (10.45, 1.50, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-3 : ది గోట్ లైఫ్ (1.15, 7.30)
: కలియుగ పట్టణంలో (4.30)
: ఓం భీమ్ భుష్ (7.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : ఓం భీమ్ భుష్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : గాడ్జిల్లా అండ్ కాంగ్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : రజాకర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్